క్లుప్తంగా

వాహనాల తనిఖీ



మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడుపరాదని ఎస్ఐ చంద్రకాంత్ సూచించారు. మంగళవారం జల్లాపురం, మానవపాడు శివారు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. నింబంధనలు పాటించని పలు వాహనదారులపై జరిమానా విధించామన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం: తల్లీ బిడ్డ క్షేమం



ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడుకు చెందిన గర్భిణి దేవిని కాన్పు కోసం 108లో మానవపాడు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది అంబులెన్స్‌లో కాన్పు చేసినట్లు వైద్యులు తెలిపారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం మానవపాడు పీహెచ్‌సీకి తరలించారు. కార్యక్రమంలో 108 ఈఎంటీ రాధామోహన్, పైలెట్ శ్రీశైలం, ఆశా కార్యకర్త ఉన్నారు.

వానరానికి చికిత్స



అయిజ: మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై మంగళవారం విద్యుతాఘాతంతో వానరం కొనప్రాణాలతో కొట్టిమిట్టాడింది. అయితే అటువైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ శేఖర్ స్నేహితుల సహాయంతో వానరాన్ని ఆటోలో పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రైవేటు వైద్యుడు జితేందర్‌రెడ్డితో వైద్యం చేయించి వానరాన్ని బతికించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు భగత్‌రెడ్డి, భీమేష్‌గౌడ్, హరిగౌడ్, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ



కేటీదొడ్డి: పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల నోడల్ ఆఫీసర్ సూచించారు. మండలంలోని కొండాపురం పాఠశాలకు 10 రోజుల క్రితం 50 మంది విద్యార్థులకు మించి రాకపోవడంతో పత్తి పొలాల వెంట తిరిగి 151 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ యుగంధర్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



ఉండవెల్లి: తహసీల్దార్ బాధ్యతలు తీసుకున్న హరికృష్ణను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, మార్కెట్ యార్డు డైరెక్టర్ నాగరాజు, నాయకులు రమేష్, నాగేష్, వెంకటేశ్‌గౌడ్, నర్సన్‌గౌడ్, నరేందర్ నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం గద్వాల మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామ నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు తాహేర్, ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ ఆధ్వర్యంలో గద్వాల మండల అధ్యక్షురాలిగా బాలీశ్వరి (పుటాన్‌పల్లి), ప్రధాన కార్యదర్శిగా రుకియా బేగం (మేలచేర్వు), కోశాధికారిగా పాండు(గుర్రంగడ్డ)లను ఎన్నుకున్నారు. సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని సూచించారు. త్వరలో జిల్లా స్థాయి నూతన కమిటీని ఎన్నికను చేపట్టనున్నట్లు వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు మంగళవారం బాధితులకు అందజేశారు. అయిజ మున్సిపాలిటీకి చెందిన లక్ష్మి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా..రూ.3 లక్షల ఎల్‌ఓసీ రావడంతో కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, శివ, జయన్న, అశోక్ తరదితరులు ఉన్నారు.

పరామర్శ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురిని ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. అయిజ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన జంగం నీలకంఠస్వామి గుండెనొప్పితో బాధపడుతూ కర్నూల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గద్వాల నియోజకవర్గంలోని బీరెల్లికి చెందిన గడ్డం వెంకటేష్ కుమారుడు జగదీష్ కర్నూల్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతన్న విషయం తెలుసుకొని పరామర్శించినట్లు తెలిపారు. అక్కడి వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు గోపాల్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి హాజరు కావాలని ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే విజయుడును ఆహ్వానించారు. ఈ నెల 29న జిల్లా కేంద్రంలో ప్రైవేట్ సంస్థల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నందు, బాబయ్యనాయుడు, మురళీధర్‌రెడ్డి, బాషా, రమేష్, బీచుపల్లి తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి

ధరూరు: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను మెరుగు పర్చడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మంచి నీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథ, జలజీవన్ మిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒకరు లేదా ఇద్దరు చొప్పున ఎంపిక చేసి, శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీల్లో చేతిపంపులు, పంపుసెట్లు, పైప్‌లైన్ మరమ్మతు, ఎలక్ట్రికల్ బోర్డులు, పంబ్లింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ పరమేష్ పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణకే షీ టీంలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

శాంతినగర్: మహిళలు, ఆడపిల్లలకు ఏ సమస్య తలెత్తినా వెంటనే షీ టీంకు ఫిర్యాదు చేయాలని షీం టీం సభ్యురాలు దివ్య అన్నారు. ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు మంగళవారం వడ్డేపల్లి మండలంలోని తనగల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు దివ్య, హనుమంతు, శేషన్న, రజిత మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాల నియంత్రణకు, ఆడపిల్లలకు రక్షణతో పాటు న్యాయం చేసేందుకు పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం షీ టీం అన్నారు. మహిళలపై దాడులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, బ్లాక్‌మెయిలింగ్, అసభ్య పదజాలంతో మాట్లాడటం, తప్పుడు మెసేజ్‌లు పంపడం, ఫోన్లు చేసి మహిళలను ఇబ్బందులకు గురిచేయడం వంటివి ఎవరు చేసిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆపద సమయంలో 87126 70312 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

బురద ఇలా.. ప్రయాణించేది ఎలా?



బురదగుంతలో వెళ్తున్న వాహనాలు

అయిజ: మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహ సమీపంలో వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డు చిత్తడిగా మారి ప్రయాణానికి ప్రతికూలంగా మారుతుంది. సోమవారం రాత్రి కురిసిన తేలిక పాటి వర్షానికి రోడ్డు బురదగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మురుగు చేరి వాహనాలు వెళ్లేటప్పుడు పైకి ఎగచిమ్మి ప్రయాణికులపై పడుతుంది. దీంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవలి కాలంలో అధికారులు రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చిపెట్టి సరిపెట్టుకున్నారు. వర్షాలకు మట్టి బురదమారుతుండడంతో వామనదారులకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి గుంతలను కంకర రాళ్లతో నింపి బీటీతో మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు



కొనసాగుతున్న పచ్చర్ల సబ్‌స్టేషన్ పనులు

రాజోళి: మండలంలోని పచ్చర్లలో చేపట్టిన 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం గత ప్రభుత్వ హయాంలో సబ్‌స్టేషన్ పనులను ప్రారంభించారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే పచ్చర్ల, తనగల, తుమ్మిళ్ల గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందనుంది. త్వరలోనే సబ్‌స్టేషన్ ఫీడర్ ద్వారా మూడు గ్రామాలకు సరఫరా అందిస్తామని ఏఈ సందీప్ తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

కాలేయవ్యాధితో బాధపడుతూ చిన్నారి మృతి



హరిత (ఫైల్)

గోపాల్‌పేట: ఏదుల మండల కేంద్రానికి చెందిన ఓ చిన్నారి కాలేయ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మరణించింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఏదులకు చెందిన కుందేళ్ల రాము, గౌరి కుమార్తె హరిత(11) జ్వరంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి చిన్నారిని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కాలేయానికి పసిరికలు సోకి పూర్తిగా చెడిపోయిందని, కాలేయం మార్చడానికి రూ. 35 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. దాతల నుంచి రూ.30 లక్షలు పోగుచేసి ఆస్పత్రిలో కట్టారు. అనంతరం తల్లి కాలేయంలో కొంతభాగాన్ని హరిత అమర్చారు. ఈ క్రమంలో మరోసారి పసిరికలు ఎక్కువ కావడంతో గుండెనొప్పితో సోమవారం హరిత మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాహనాల వేలం

అలంపూర్: ఎక్సైజ్ నేరాల్లో జప్తు చేయబడిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ హనుమనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయ ఆవరణలో ఈ నెల 26వ తేదీన ఉదయం 11.30 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రొహిబీషన్, ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

పరిసరాలను కాపాడుతాం



అయిజ: మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని గీతాంజలి పాఠశాలలో మంగళవారం మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సురేష్ పరిసరాలను కాపాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు తమ ఇళ్లతోపాటు చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది నరేష్, సురేందర్, ప్రకాష్, రాకేష్, పాఠశాల కరస్పాండెంట్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన రేషన్ డీలర్లు



అయిజ: కొన్నేళ్ల నుంచి నెలకొన్న రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి అయిజ మండల రేషన్ డీలర్లు తరలివెళ్లారు. కార్యక్రమంలో రాముడు, చిన్న శ్రీను, ప్రతాప్, హనుమన్న, సురేష్; శ్రీధర్ ఉన్నారు.

భారీ కొండచిలువ పట్టివేత



వనపర్తి: జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులోని వాసవీ కల్యాణ మండపం సమీపంలో ముళ్ల పొదల్లో కొండ చిలువ ఉందని స్థానిక ఏఆర్ కానిస్టేబుల్ ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి దానిని పట్టుకున్నట్లు సాగర్ స్నేక్స్ సొసైటీ నిర్వాహకులు కృష్ణసాగర్ తెలిపారు. మంగళవారం కొండ చిలువను ఫారెస్టు అధికారులకు అప్పగించారు. భారీ వర్షాలకు ప్రాజెక్టుల్లో నుంచి వచ్చే వరద నీటిలో మొసళ్లు, కొండ చిలువలు నదీ పరివాహక ప్రాంతాలు, చెరువులకు వచ్చే అవకాశం ఉందని కృష్ణసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, సెక్షన్ ఆఫీసర్లు బాలకిష్టమ్మ, రాణి రామచందర్, చందు, శీను తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన



తూంకుంటలో మాట్లాడుతున్న కోయ వెంకటేశ్వరరావు

వీపనగండ్ల: విద్యార్థులు మూఢనమ్మకాలను విడనాడి, చదువుపై శ్రద్ధ పెడితే ఉన్నతంగా రాణించగలుగుతారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యుడు కోయ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం తూంకుంట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఇటీవల క్షుద్ర పూజలు జరిపారన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్ యుగంలో మూఢనమ్మకాలను విశ్వసించరాదని, ఇలాంటి ఘటనలతో మానసిక ధైర్యాన్ని కోల్పోరాదని ఆయన విద్యార్థులకు సూచించారు. క్షుద్రపూజల పేరుతో విద్యార్థుల మనోధైర్యాన్ని దెబ్బతీయాలని చూసేవారిని గ్రామస్తులు, పోలీసులు గుర్తించి చట్ట పరంగా శిక్షలు పడేవిధంగా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జితేందర్‌గౌడ్, పి వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి రవి, జిల్లా కార్యదర్శి నాగశేషి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి



ధరూరులో ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గద్వాల అర్బన్: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవాభావాన్ని కలిగి ఉండాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల్లో విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, సమాజ సేవా దృక్పతాన్ని పెంపొందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం–ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ పరంజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

మల్దకల్: ప్రతి విద్యార్థి చదువుతో పాటు సేవా గుణం అలవరచుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల పరిసరాల్లోని పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, అధ్యాపకులు గోవర్ధన్‌శెట్టి, తిమ్మోతి, శ్రీనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గట్టు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హృదయరాజు సూచన మేరకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేఎస్ రాజు ఆధ్వర్యంలో జాతీయసేవ పథక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ అని, సేవ అందించడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్రని గొప్పదని పేర్కొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హృదయరాజ్, అధ్యాపకులు, వద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పేరు కొనసాగించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అలంపూర్: పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరును కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మంజులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరును సురవరం ప్రతాప్‌రెడ్డి యూనివర్శిటీగా ప్రకటించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సురవరం ప్రతాప్‌రెడ్డికి ఆర్యవైశ్యులు వ్యతిరేకం కాదని, ప్రభుత్వం చేపట్టే మరొక ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిలుకూరు వేణుగోపాలయ్య, ప్రధానకార్యదర్శి చిలుకూరు రమేష్‌గుప్త, కోశాధికారి ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి, ఉప కోశాధికారి శ్రీధర్, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి నిత్యాన్నసత్రం ప్రధాన కార్యదర్శి చిలుకూరి నాగరాజు, కోశాధికారి తిరుపాలయ్యశెట్టి, మాజీ అధ్యక్షుడు రవిప్రకాష్, జూటూరు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాలు పంపిణీ



మల్దకల్‌లో..



ఉత్తనూర్‌లో..

మల్దకల్: మండలంలోని అమరవాయి, సద్దలోనిపల్లి, మల్దకల్ గ్రామాల్లో మంగళవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. సబ్సిడీ పత్రాలను రేషన్‌కార్డు ఉన్న ప్రతి మహిళకు అందజేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాఘవేందర్, నర్సింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని ఉత్తనూరులో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న సబ్సిడీ గ్యాస్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందన్నారు. సబ్సిడీ గ్యాస్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగన్న, పరమేశ్, లక్ష్మన్న, శేషన్న, పెద్దన్న, యేసన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



ర్యాలంపాడు గురుకుల పాఠశాల వద్ద ఆహారాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గట్టు: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గూడురు నాగరాజ్, సభ్యత్వ కన్వీనర్ నల్లారెడ్డి అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఆలూర్ నల్లగట్టుతండా గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాండునాయక్, గోవిందు, నర్సింహులు, ఆంజనేయులు, వీరురెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ధరూరు: గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ర్యాలంపాడు శివారులో ఉన్న జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను వారు సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని, నీళ్ల చారుతో పోస్తున్నారని ధ్వజమెత్తారు. హాస్టళ్లలో సదుపాయాలు కల్పించి పౌష్టికాహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ జనరల్ సెక్రెటరీ సంజయ్ ఘనతే, రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు, జిల్లా అధ్యక్షుడు దేవదాస్, నాయకులు శివారెడ్డి, బండల వెంకట్రాములు, కిష్టన్న, నర్సింహ, శ్రీకాంత్, ఓంకార్, శేఖర్‌రెడ్డి, రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిని బాగు చేయండి



రాజోళి, వడ్డేపల్లి రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

రాజోళి: రాజోళి, వడ్డేపల్లి రహదారిలో ఏర్పడిన గుంతలు పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు. రాజోళి శివారు వరకు బీటీ రోడ్డు వేసినప్పటికీ.. అక్కడి నుంచి వడ్డేపల్లి వరకు ఇంకా రోడ్డు వేయకపోవడంతో, రోడ్డు మొత్తం మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు వాపోతున్నారు. వడ్డేపల్లి దాటిన తర్వాత శాంతినగర్ వరకు రోడ్డు లెవెల్ చేస్తున్నప్పటికీ, వడ్డేపల్లి నుంచి రాజోళి శివారు వరకు రోడ్డు కూడా లేకపోవడంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో వాహనాలు తూర్పు గార్లపాడు మీదుగా శాంతినగర్‌కు చేరుకుంటున్నారు. ప్రధాన రోడ్డుపై గుంతలు పూడ్చితే చుట్టూ తిరిగి రావాల్సిన అవసరముందని స్థానికులు అంటున్నారు. ఇదే రోడ్డుపై కర్నూల్ జిల్లాకు కూడా వెళ్లే వారు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో, రోడ్డు పనులు త్వరగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతింది. ఇప్పటికైనా జాప్యం చేయవద్దని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

గట్టు: మండలంలోని చాగదోణ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వాసంతి మాట్లాడుతూ నేటి కిషోర బాలికలే రేపటి శక్తివంతమైన మహిళలుగా తీర్చిదిద్దాలంటే పోషకాహారం తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులతో అన్నప్రాసన చేయించారు.